క్లుప్తంగా

విదేశీ విద్యపై అవగాహన

అశ్వారావుపేట: అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల విద్యార్థులకు విదేశీ విద్యపై అవగాహన కార్యక్రమం శుక్రవారం కళాశాలలో నిర్వహించారు. స్కార్లెట్ ఐబీస్ ఓవర్సీస్ కన్సల్టెన్సీ డైరెక్టర్ బి.రవి విదేశీ విద్యావకాశాలు, ఉన్నత విద్యపై అవగాహన కల్పించారు. అదే కంపెనీకి చెందిన డిజిటల్ మార్కెటింగ్ మేనేజర్ పి.పుతిన్ డిజిటల్ మార్కెటింగ్ అవకాశాలను వివరించారు. మాస్టర్ ట్రైనర్ పి.శంకర్ విదేశీ విద్యావకాశం నిర్వహించే పరీక్షలు ఐఈఎల్‌టీఎస్, టోఫెల్, జీమాట్, పీటీఈ వంటి పోటీ పరీక్షల అర్హత, నైపుణ్యాలను వివరించారు. రెండ్రోజుల పాటు జరిగిన ఈ కార్యక్రమాన్ని ఎస్సీ, ఎస్టీ సెల్, టాక్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సెల్ ఇన్‌చార్జ్ కోటేశ్వర్, టాక్‌క్లబ్ ఇన్‌చార్జ్ డాక్టర్ శ్రావణ్‌కుమార్ కార్యక్రమాన్ని సమన్వయించగా.. ఇన్‌చార్జ్ అసోసియేట్ డీన్ డాక్టర్ కె.గోపాలకృష్ణమూర్తి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వ్యవహరించారు.

బ్రహ్మోత్సవాలు ప్రారంభం

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణం వెంకటేశ్వర కాలనీలోని శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు ఆలయ అర్చకులు అంకురార్పన చేసి స్వామివారికి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 25న పౌర్ణమి నాడు స్వామివారి కల్యాణ వేడుకను అత్యంత వైభవగంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. తొలి రోజు పూజ కార్యక్రమాలలో భద్రాద్రి దేవస్థాన విశ్రాంత ప్రధాన అర్చకుడు పొడిచేటి జగన్నాథచార్యులు, ఆలయ అర్చకులు నారాయణాచార్యులు, శ్రీకరాచార్యులు, భద్రాద్రి దేవస్థాన ప్రధాన అర్చకులు శేషు అచ్యుత్‌కుమార్, రామచార్యులు పాల్గొన్నారు.

నగదు వితరణ

భద్రాచలంఅర్బన్: పట్టణంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్ల రోడ్డులోని ఇండస్ట్రీయల్ ఏరియాకి చెందిన వ్యాపారులు రూ.లక్ష విరాళాలు సేకరించి శుక్రవారం భద్రాచలం ట్రాఫిక్ ఎస్సై మధుప్రసాద్‌కి అందజేశారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్సై మధుప్రసాద్ మాట్లాడుతూ.. దొంగతనాలు నివారణకు, గొడవలపై నిఘా ఉంచేందుకు సీసీ కెమెరాలు ఉపయోగపడుతాయని తెలిపారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజలు సహకరించాలని కోరారు. ఇండస్ట్రీయల్ ఏరియా వ్యాపారులు, ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పట్టుదలతో సాధించాలి

అశ్వారావుపేటరూరల్: భవిష్యత్ లక్ష్యాలను సాధించేందుకు విద్యార్థులు పట్టుదలతో కృషి చేయాలని ప్రముఖ విద్యావేత్త, కెరీర్ గైడెన్స్ కౌన్సెలర్ బి.లక్ష్మీనారాయణ అన్నారు. శుక్రవారం మండలంలోని నారంవారిగూడెం ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం లక్ష్మీనారాయణను పాఠశాల ఉపాధ్యాయులంతా కలిసి సన్మానించారు. హెచ్ఎం పున్నం చంద్రశేఖరరావు, ఉపాధ్యాయులు హరినాథ్, రామారావు, శ్రీనివాసరెడ్డి, రేణుక పాల్గొన్నారు.

కిసాన్ మోర్చా సమావేశం

దమ్మపేట: అమరవీరుల దినోత్సవాన్ని ప్రజాస్వామ్య పరిరక్షణ దినోత్సవంగా గుర్తించాలని సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో సంయుక్త కిసాన్ మోర్చా మండల సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా నాయకులు అమర్లపూడి రాము మాట్లాడుతూ... భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వంటి అమరవీరుల పోరాటాలకు గుర్తుగా మార్చి 23న ప్రజాస్వామ్య పరిరక్షణ దినోత్సవంగా నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు దొడ్డా లక్ష్మీనారాయణ, మోరంపూడి శ్రీనివాసరావు, తోడెం దుర్గమ్మ, కుర్సం ముత్యాలరావు, పందూరి వీరబాబు, కొప్పుల శ్రీను పాల్గొన్నారు.

సకాలంలో అందించాలి

చండ్రుగొండ: బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు సకాలంలో మందులు ఇవ్వాలని పీఓ ఎన్‌సీడీ డాక్టర్ మధుసుదన్ ఏఎన్ఎంలకు సూచించారు. చండ్రుగొండ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యసిబ్బందికి అవగాహన కల్పించారు. అనంతరం ఎన్‌సీడీ రికార్డులు, పోర్టర్, పాలో అప్‌స్కీన్‌లను పరిశీలించారు. డాక్టర్ తనుజ, డాక్టర్ వెంకట్ ప్రకాష్, డబ్ల్యూహెచ్ఓ శ్రీకాంత్, హెల్త్‌సూపర్‌వైజర్ యండి.ఇమాం పాల్గొన్నారు.

అండగా ఎర్రజెండా

మణుగూరుటౌన్: కార్మికులకు అండగా ఎర్రజెండా ఉంటుందని, ఏ కష్టం వచ్చినా సమస్యల పరిష్కారం కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తుందని ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ వై.రాంగోపాల్ అన్నారు. శుక్రవారం మణుగూరు ఓసీలో జరిగిన ఫిట్ సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం ఏఐటీయూసీలో జాయిన్ అయిన సుధాకర్, గుండేటి రవికుమార్, బుక్య శివ, రామకృష్ణ, రవికిరణ్, దినేశ్, శ్రీధర్, రవిబాబు, రాజేశ్, మోతిలాల్, రాజశేఖర్, రాంబాబు కార్మికులకు కండువా వేసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాయి ప్రకాశ్, సురేందర్, దాట్ల సందీప్‌కుమార్, నరేందర్, కోటేశ్వరరావు, ముత్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

కిక్కెక్కుతున్న పురవీధులు

- భద్రాచలంలో 300కు పైగా బెల్ట్ షాపులు
- ఆధ్యాత్మిక కేంద్రంలో అడ్డగోలుగా విస్తరణ
- అధిక ధరల వసూళ్లతో సామాన్యులపై భారం



భద్రాచలం: ప్రభుత్వ నిబంధనలు, ధరలు ఒకటి.. క్షేత్రస్థాయిలో విక్రయాలు జరిపే ధర మరొకటి. అందిన కాడికి మద్యం ప్రియులను దోచుకోవటమే పనిగా, విచ్చలవిడిగా వెలుస్తున్న బెల్ట్ దుకాణాలపై మద్యం ప్రియులు, వారి కుటుంబ సభ్యులు ఆగ్రహావేశాలను వ్యక్తం చేస్తున్నారు. ఆధ్యాత్మిక కేంద్రంలోనూ విచ్చలవిడిగా బెల్ట్ షాపులు వెలుస్తున్నప్పటికీ మామూళ్ల మత్తులో ఎక్సైజ్ అధికారులు తీసుకుంటున్న చర్యలు శూన్యం.

నిలువు దోపిడీ..

మద్యం ప్రియుల నిలువు దోపిడీకి కేరాఫ్ అడ్రస్‌లుగా బెల్ట్ షాపులు నిలుస్తున్నాయి. మద్యం దుకాణాదారులు సిండికేట్‌గా ఏర్పడి ఈ బెల్ట్ షాప్ దందాను నిర్వహిస్తున్నారు. కొన్ని కంపెనీ బ్రాండ్‌లకే వైన్ షాపులలో పరిమితం చేసి కావాలని కొరతను సృష్టిస్తున్నారు. కొరతగా ఉన్న బ్రాండ్‌లను బెల్ట్ షాపులకు గుట్టు చప్పుడు కాకుండా తరలించి అక్కడ అధిక ధరలకు అమ్ముతున్నారు. దీంతో సదరు బ్రాండ్ కావాలంటే మద్యం ప్రియులు ఖచ్చితంగా ఆ బెల్ట్ షాపుకు వెళ్లాల్సిందే. క్వార్టర్, ఫుల్ బాటిళ్లకు సుమారు రూ.30 నుంచి 150ల వరకు అధిక ధరలను వసూలు చేస్తున్నారు. రాత్రైనా, పగలైనా, పండుగైనా, జాతీయ పండుగలైనా మద్యం కావాలంటే బెల్ట్ షాపుల్లో దొరుకుతోంది.

టెంపుల్ సిటీలో 300 షాపులు..

పుణ్యక్షేత్రమైన భద్రాచలంలో భక్తితో పాటు మందుకు కొదవ లేకుండా పోతోంది. భద్రాచలంలో అధికారికంగా ఐదు మద్యం షాపులకు ప్రభుత్వం అనుమతిని ఇచ్చింది. అయితే ఈ దుకాణా యజమానులు సిండికేట్‌గా ఏర్పడి సుమారు 300 బెల్ట్ షాపులకు మద్యంను అనధికారికంగా సరఫరా చేస్తున్నారు. దీంతో బెల్ట్ షాపు నిర్వహణను స్వయం ఉపాధి కేంద్రాలుగా మార్చుకుంటున్నారు యువత, పలు కుటుంబాలు. గుడి, బడి అని తేడా లేకుండా నివాస ప్రాంతాల్లో సైతం వీటి నిర్వహణ సాగుతుంది. రామాలయ పరిసర ప్రాంతాలలో సైతం నిబంధనలకు విరుద్ధంగా ఈ దుకాణాల నిర్వహణ సాగుతుండటం శోచనీయం. బెల్ట్ షాపుల నుంచి వచ్చే మందుబాబులతో స్థానికులు, విద్యార్థులు, మహిళలు, భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

పట్టింపులేని ఎక్సైజ్ శాఖ..

భద్రగిరి పుణ్యక్షేత్ర పరిసర ప్రాంతాల్లో ఇష్టానురీతిగా బెల్ట్ దుకాణాలు వెలుస్తున్నప్పటికీ ఎక్సైజ్ శాఖ అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. స్వయం ఉపాధి కేంద్రాలుగా పాన్ షాపులతో సమాంతరంగా బెల్ట్ దుకాణాలను నిర్వహిస్తున్నప్పటికీ స్థానిక, జిల్లా అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అరకొర దాడులకే పరిమితం అవుతున్న అధికారులు.. పూర్తి స్థాయిలో కట్టడి చేయడంలో విఫలమవుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

కఠిన చర్యలు తీసుకుంటాం..

నిబంధనలకు విరుద్ధంగా బెల్ట్ దుకాణాలను నడిపితే కఠిన చర్యలు తీసుకుంటాం. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో మా శాఖా అధికారులు, సిబ్బంది దాడులు నిర్వహిస్తునే ఉన్నారు. మా దృష్టికి వస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

– జానయ్య, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్

డిగ్రీ విద్యార్థుల క్షేత్ర పరిశీలన



రాక్షస గుళ్ల వివరాలు వెల్లడిస్తున్న ప్రిన్సిపాల్ జాన్ మిల్టన్

భద్రాచలంటౌన్: భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాల చరిత్ర విభాగం, పొలిటికల్ సైన్స్, ఎకనామిక్స్, కెమిస్ట్రీ విభాగాల విద్యార్థులు ఆశ్వాపురం మండలంలోని వేగులూరు ప్రాంతానికి క్షేత్ర పరిశీలనకు శుక్రవారం వెళ్లారు. సుమారు 50 మంది విద్యార్థులు వెళ్లిన ఈ పరిశీలనకు.. పరిశోధకులుగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జాన్ మిల్టన్ పాల్గొన్నారు. విద్యార్థులకు ప్రాంత విశిష్టతను ఆయన వివరించారు. మాట్లాడుతూ.. పరిశీలన ప్రాంతంలోని రాక్షస గుళ్లగా పిలువబడుతున్న ప్రాంతంలో ఒక కొత్త సంస్కృతిని కనుగొనే ప్రాంతంగా గుర్తించినట్లు తెలిపారు. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు ఒక నివేదిక ద్వారా సంబంధిత విభాగాలకు అందజేసి సమగ్ర పరిశోధన చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో వేముల కామేశ్వరరావు, కిరణ్‌కుమార్, బాలాజీ, హిమజ, భవాని, సునీత, వెంకటేశ్వర్లు, వేణు, కృష్ణ, సురేష్, ధర్మ తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌కు అవార్డు అందజేత

మణుగూరురూరల్: అపహరణకు గురైన ఫోన్‌ను అరగంటలో కనిపెట్టిన కానిస్టేబుల్ షమీమ్‌ను మణుగూరు డీఎస్పీ వంగ రవీందర్‌రెడ్డి అభినందించి క్యాష్ అవార్డ్, షీల్డ్ అందజేశారు. ఇటీవలే మున్సిపాలిటీ పరిధిలోని ఆదర్శనగర్‌కు చెందిన నేత్ర వైద్యుడు గంజికుంట్ల సంజీవరావు ఇంట్లో ఐఫోన్‌ను అపహరణకు గురైంది. మణుగూరు సీఐ సతీష్‌కుమార్ నేతృత్వంలో కానిస్టేబుల్ షేక్ అబ్దుల్ షమీమ్ అర్ధగంటలో ఛేదించి ఫోన్‌ను బాధితుడికి అందజేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. పోలీసులు ప్రజాసేవకులని, ప్రజలకు ఏ ఇబ్బందీ కలకుండా పోలీస్‌శాఖ అండగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో సీఐ సతీష్‌కుమార్, ప్రభుత్వ నేత్ర వైద్యాధికారి సంజీవరావు పాల్గొన్నారు.



కానిస్టేబుల్‌కు షీల్డు అందజేస్తున్న డీఎస్పీ రవీందర్‌రెడ్డి

పట్టింపులేని ఉద్యోగుల ఆరోగ్యం



మాట్లాడుతున్న కృష్ణంరాజు

మణుగూరుటౌన్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని ప్రైవేట్ క్రషర్లకు ఇస్తున్న ప్రాధాన్యత కంపెనీ ఉద్యోగుల ఆరోగ్యంపై లేకపోవడం దురదృష్టకరమని ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ కృష్ణంరాజు అన్నారు. శుక్రవారం పీవీ కాలనీలోని కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పీకే ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్.. గెలుపొంది ప్రాతినిధ్యం వహిస్తున్న యూనియన్‌ను కాదని మరో యూనియన్‌కి ప్రాధాన్యతిస్తూ ఐఎన్‌టీయూసీని నాయకులను, కార్యకర్తలను చిన్నచూపు చూడటం సరైంది కాదన్నారు. పీకే–ఓసీ కొత్త సైట్ ఆఫీసులో సౌకర్యాలు లేకుండా కార్మికుల తరలింపు చేస్తున్నారన్నారు. లక్కీ క్రషర్ విపరీతమైన డస్ట్ వెలువడుతున్న కనీస ప్రత్యామ్నాయ ఏర్పాట్లు లేకుండా తరలించారని దీని వల్ల కార్మికులు శ్వాసకోశ, ఇతర అనారోగ్యాల బారిన పడుతున్నారన్నారు. సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. గట్టయ్య, యాదవ్, షాబుద్దీన్, రాములు, మస్తాన్ నాయుడు, కరుణాకర్, చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ జయరాజు, శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీ సంతోష్ చరణ్, రామారావు, రవి ఉన్నారు.

బీజేపీతో ప్రజాస్వామ్యానికి విఘాతం

బూర్గంపాడు: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ విధానాలతో ప్రజాస్వామ్యానికి విఘాతం కలుగుతుందని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ నాయకుడు జక్కుల రాంబాబు, వైఎస్ రెడ్డి ఆరోపించారు. నకిరిపేట గ్రామంలో జరిగిన భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురు వర్ధంతి సభల ప్రచార పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నరేంద్ర మోడీ ప్రభుత్వం హిందుత్వ భావజాలంతో యువత మెదళ్లలో విషం నింపుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో శాంతకుమారి, రజని, జోగారావు, కాంతయ్య, రమేష్, రాజు, రామారావు పాల్గొన్నారు.

ములకలపల్లి: భగత్‌సింగ్, రాజగురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతి సభలను గ్రామగ్రామానా నిర్వహించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ములకలపల్లి సబ్ డివిజన్ కార్యదర్శి కుంజా కృష్ణ పిలుపునిచ్చారు. ఈ మేరకు మండల పరిధిలోని గుట్టగూడెం గ్రామంలో శుక్రవారం పోస్టర్ ఆవిష్కరించారు.



బూర్గంపాడు: పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎన్డీ నాయకులు

ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన రైతాంగ వ్యతిరేక విధానాలను వ్యతిరేకించాలని, కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టే నూతన చట్టాలను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. పీవైఎల్ నాయకులు వంకా సురేశ్, దుబ్బా వెంకటేశ్, కోటేశ్, మహిళా సంఘం నాయకులు సరస్వతి, సుజాత, కోటమ్మ, ముత్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైస్ చైర్మన్ ఎన్నిక ఏకగ్రీవం

దమ్మపేట: దమ్మపేట కోఆపరేటివ్ సొసైటీ వైస్ చైర్మన్‌గా కట్టం ఎర్రప్పను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం సొసైటీ కార్యాలయంలో ఎన్నికల ప్రత్యేక అధికారి రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన వైస్ చైర్మన్ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. ఎర్రప్పకు ఎన్నికల అధికారి, సొసైటీ చైర్మన్ ఎల్లిన రాఘవరావు చేతులమీదుగా నియమాక పత్రం అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు పాలిమేట్ల రవి, బొల్లికొండ నాగేశ్వరరావు, నాయకులు కట్రం స్వామి, వలీపాషా, కేవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు

చండ్రుగొండ: మండలకేంద్రం చండ్రుగొండలోని లక్ష్మీతిరుపతమ్మ చికెన్ సెంటర్ ఆధ్వర్యంలో ముస్లిం సోదరులకు శుక్రవారం రాత్రి ఇఫ్తార్ విందు ఇచ్చారు. రంజాన్ పవిత్ర మాసాన్ని పురస్కరించుకుని ఉపవాసాలు (రోజా) ఉంటున్న ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చిన సోమనపల్లి సైదులు మతసామరస్యాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో సోమనపల్లి మధు, మాజీ సర్పంచ్ ఇస్లావత్ రుక్మిణి, మజీద్ కమిటీ సదర్ యండి.షమీహుసేన్, యాకూబ్ అలీ, కడియాల పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

చిత్రలేఖనం పోటీలు

మణుగూరురూరల్: మున్సిపాలిటీలోని పైలట్ కాలనీ ఎక్స్‌లెంట్ హైస్కూల్‌లో శుక్రవారం ప్రపంచ జల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. పోటీలో విద్యార్థులు వివిధ చిత్రాలను గీసి చక్కని ప్రతిభ కనబర్చారు. గెలుపొందిన వారికి ఎక్స్‌లెంట్ విద్యాసంస్థల కరస్పాండెంట్ ఎండి.ఖాదర్ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి ఆర్థిక సాయం

భద్రాచలంఅర్బన్: లయన్స్ క్లబ్ ఆఫ్ భద్రాచలం ఆధ్వర్యంలో భద్రాచలం పట్టణానికి చెందిన తమ్మిశెట్టి గణేష్ అనే మెకానికల్ ఇంజనీరింగ్ చదువుతున్న విద్యార్థికి సహాయంగా రూ.18,500లు నగదును అందించారు. ఈ సందర్భంగా శుక్రవారం పట్టణంలోని లయన్స్ క్లబ్ కార్యాలయంలో ఆ మొత్తాన్ని విద్యార్థి తల్లిదండ్రుల చేతికి అందించారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ఆఫ్ భద్రాచలం అధ్యక్షుడు బీవీ వెంకటరెడ్డి, క్లబ్ కోశాధికారి భరత్, సభ్యులు దేశప్ప, సోమశేఖర్, భోగాల శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రజకులను ఆదుకోవాలి

ములకలపల్లి: రజకులను ప్రభుత్వం ఆదుకోవాలని రజక వృత్తిదారుల సంఘ జిల్లా అధ్యక్షుడు ముదిగొండ రాంబాబు అన్నారు. మండల పరిధిలోని జగన్నాథపురంలో శుక్రవారం నిర్వహించిన సంఘ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 10 లక్షల కుటుంబాలు రజకవృత్తిపై జీవనం సాగిస్తున్నాయని, ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికపరంగా వెనుకబడిన రజకులకు పాలకపక్షం అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. జగన్నాథపురం గ్రామశాఖ అధ్యక్ష, కార్యదర్శులు జి.నాగమణి. కె.వెంకటేశ్వర్లు, కె.రాజేశ్వరి, చీదర్ల రమణ, కె.స్వాతి, కె.ప్రవీణ్. నిమ్మల పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఎందుకు ఈ ఆలస్యం..!?

బూర్గంపాడు: మండల కేంద్రం బూర్గంపాడులో ఐటీసీ సహకారంతో నిర్మించిన పబ్లిక్ టాయిలెట్లు ప్రారంభానికి నోచుకోవడం లేదు. దీంతో అవి నిరుపయోగంగా మారాయి. మండల కేంద్రానికి వివిధ పనుల కోసం వస్తున్న ప్రజలకు పబ్లిక్ టాయిలెట్స్ లేకపోవటంతో చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ పబ్లిక్ టాయిలెట్స్ నిర్మించాలని ఎన్డీ నాయకులు పున్నంచంద్ ఏళ్ల తరబడి అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవిస్తున్నారు. అయినా ఎవరూ పట్టించుకోలేదు. ఆయన విజ్ఞప్తులతో ఐటీసీ అధికారులు బూర్గంపాడులో పబ్లిక్ టాయిలెట్లను నిర్మించారు. ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో నిర్మించిన ఈ పబ్లిక్ టాయిలెట్లకు బోరును కూడా ఏర్పాటు చేశారు. మూడు నెలల క్రితమే నిర్మాణ పనులు మొత్తం పూర్తయ్యాయి. అయితే స్థానిక ప్రజాప్రతినిధులకు ఈ పబ్లిక్ టాయిలెట్స్‌ను ప్రారంభించేందుకు తీరిక లేకుండా పోయింది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి లక్షలు వెచ్చించి నిర్మించిన పబ్లిక్ టాయిలెట్లను ప్రారంభించి వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.



బూర్గంపాడులో ఐటీసీ నిర్మించి, ప్రారంభించని పబ్లిక్ టాయిలెట్లు

'ఆలయ ఆదాయం దుర్వినియోగం'

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం గ్రామంలో ఉన్న ముత్యాలమ్మ అమ్మవారి ఆలయానికి వచ్చే ఆదాయాన్ని గత పాలక కమిటీ దుర్వినియోగం చేసిందని నూతన ఆలయ కమిటీ అధ్యక్షుడు అల్లాడి వెంకటేశ్వరావు, ఆలయ మాజీ అధ్యక్షుడు, గ్రామ పెద్దలు ఆరోపిస్తూ శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. జాతర జరిగి సంవత్సరం దాటిన నేటి వరకు జాతర జమా ఖర్చులు చెప్పకుండా గత పాలక కమిటీ నిర్లక్ష్యం చేయడంతో స్టీరింగ్ కమిటీ, గ్రామ పెద్దల సమక్షంలో నూతన ఆలయ కమిటీ చైర్మన్‌గా అల్లాడి వెంకటేశ్వరరావును ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు.

గత మూడు సంవత్సరాల క్రితం ఆలయ కమిటీ అధ్యక్షుడిగా చుక్కా గణేష్‌రెడ్డి, కార్యదర్శిగా బైరెడ్డి సతీష్‌లతో పాటు మరో 16 మంది కార్యవర్గ సభ్యులుగా ఏర్పడిన కమిటీ నేటికి ఒక్క సమావేశం నిర్వహించలేదని, ఆలయ ఆదాయ వివరాలను తెలియపర్చలేదని ఆరోపించారు. ఆలయ అనవాయితీ ప్రకారం జాతర జరిగిన మూడు నెలలకు జాతరకు సంబంధించిన జమా ఖర్చులను స్టీరింగ్ కమిటీకీ, గ్రామ పెద్దలకు, గ్రామస్తులకు తెలపాల్సి ఉండగా నేటి వరకు జాతరకు సంబంధించిన లెక్కలు చెప్పకపోవడం గత పాలక కమిటీ నిర్లక్ష్యానికి నిదర్శనం అన్నారు.

శాంతియుత వాతావరణానికి తోడ్పడండి



బుడుగుల గ్రామస్తులతో మాట్లాడుతున్న మణుగూరు డీఎస్పీ, సీఐ

మణుగూరుటౌన్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా శాంతియుత వాతావరణానికి తోడ్పడాలని మణుగూరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మణుగూరు మండలంలోని ఆదివాసీ గ్రామమైన బుగ్గ పంచాయతీలోని బుడుగుల గ్రామాన్ని సందర్శించి గ్రామస్తులతో మాట్లాడారు. వివరాలు సేకరించారు. అపరిచితులు తారసపడితే సమాచారం అందించాలని సూచించారు. సంఘవిద్రోహ శక్తులకు సహాయం, ఆశ్రయం కల్పించవద్దని అన్నారు. గ్రామంలో ఏ ఇబ్బంది ఉన్నా స్వేచ్ఛగా తమను సంప్రదించి సమస్య పరిష్కరం చేసుకోవాలని భరోసానిచ్చారు. కార్యక్రమంలో మణుగూరు సీఐ సతీష్‌కుమార్, ఎస్సై రాజేశ్, స్పెషల్‌పార్టీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

'మన ఇసుక' వాహనాలతో సరఫరా

బూర్గంపాడు: భవన నిర్మాణ పనులకు మన ఇసుక వాహనాలతో ఇసుకను సరఫరా చేస్తున్నట్లు తహసీల్దార్ ఎండి.ముజాహిద్ తెలిపారు. బూర్గంపాడులోని కిన్నెరసాని నుంచి ఇసుకను సరఫరా చేసేందుకు మన ఇసుక వాహనాలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మన ఇసుక వాహనాలను అత్యంత పారదర్శకంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఇసుక అవసరమైన వారు ఆన్‌లైన్‌లో ఇసుకను బుక్ చేసుకుంటే ఇసుక వాహనాలతో నేరుగా ఇంటికి సరఫరా చేస్తామన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్‌పెక్టర్లు ముత్తయ్య, నర్సింహారావు, గ్రామపంచాయతీ ఈఓ సమ్మయ్య, ఇసుక రీచ్ ఎస్ఆర్ఓ యుగంధర్, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఇసుక సరఫరాను ప్రారంభిస్తున్న తహసీల్దార్ ముజాహిద్ తదితరులు

ఎన్నికల నిబంధనలు పాటించాలి

అన్నపురెడ్డిపల్లి: ఎన్నికల నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని, లేదంటే కఠిన చర్యలు తీసుకుంటామని స్థానిక ఎస్సై చంద్రశేఖర్ హెచ్చరించారు. బుధవారం మండల పరిధిలోని బూర్గుడెం గ్రామంలో జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ వద్ద వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎలక్షన్ కమిషన్ జారీ చేసిన నిబంధనల మేరకే నగదును తీసుకువెళ్లాలని సూచించారు. మద్యం, నగదు అక్రమంగా తరలించకుండా నిరంతరం మండలంలో వాహనాల తనిఖీలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



అశ్వారావుపేటరూరల్: ప్రతిజ్ఞ చేస్తున్న తల్లులు, చిన్నారులు



దమ్మపేట: మొండివర్రెలో గర్భిణులకు సీమంతం చేస్తున్న అంగన్‌వాడీలు

అశ్వారావుపేటరూరల్: గర్భిణులు, బాలింతలు, చిన్నారులు క్రమం తప్పకుండా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని టీచర్లు తెల్లం మంగ, కేధారేశ్వరి అన్నారు. శుక్రవారం మండలంలోని జమ్మిగూడెం సెక్టార్ పరిధిలోగల ఊట్లపల్లి–2 కేంద్రంలో పోషణ్ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లులకు చిరు ధాన్యాలు, పోషకాహారం గురించి అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించి, ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఆయాలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చండ్రుగొండ: మండలంలోని సామ్యాతండాలో గర్భిణులకు శుక్రవారం సామూహిక సీమంతాలు చేశారు. ఐసీడీఎస్ చండ్రుగొండ ప్రాజెక్ట్ పరిధిలోని తండాలో పోషణ పక్వాడాలో భాగంగా సీమంతాలతోపాటు చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేశారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ ఇందు, సూపర్‌వైజర్ రాణి, టీచర్ సరోజ, జ్యోతి, కుమారి, రమ్యా, యశోదా పాల్గొన్నారు.

దమ్మపేట: మండలంలోని మొండివర్రె, శ్రీరాంపురం అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు సామూహిక సీమంతాలు, చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసాలను శుక్రవారం నిర్వహించారు. గర్భిణులకు నూతన వస్త్రాలు, పండ్లను అందజేసి ఆశీర్వదించారు. కార్యక్రమంలో సెక్టార్ సూపర్వైజర్ మాధవి మాట్లాడుతూ.. గర్భిణులు తీసుకోవాల్సిన పోషకాహార అవశ్యకతను, చిన్నారులకు అందించే బాలమృతం ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.



అశ్వాపురం: గర్భిణులకు సీమంతం చేస్తున్న సీడీపీఓ ప్రమీల, అంగన్‌వాడీ టీచర్లు

అశ్వాపురం: గర్భిణులు, బాలింతలు, చిన్నారులు బలమైన పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ బూర్గంపాడు ప్రాజెక్ట్ సీడీపీఓ ప్రమీల అన్నారు. మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామ పంచాయతీలో శుక్రవారం సవళ్లగూడెం–2 అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులకు సీమంతం, చిన్నారికి అక్షరాభ్యాసం చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ రాజేశ్వరి, అంగన్‌వాడీ టీచర్లు రెడ్డి అరుణ, నాగమణి, రామమ్మ, సాహితి, దీప్తి, గర్భిణులు, తల్లులు, స్థానికులు పాల్గొన్నారు.